ప్రజాశక్తి
శుక్రవారం 25 జులై 2025
5
అనంతపురం

జీడిపల్లి రిజర్వాయర్‌కు కృష్ణా జలాలు

ప్రజాశక్తి-బెళుగుప్ప

కృష్ణా జలాలు పరవళ్లు తొక్కుతూ జీడిపల్లి రిజర్వాయర్‌కు చేరాయి. రాగులపాడు పంప్‌హౌస్ నుంచి గురువారం తెల్లవారుజామున అనంతపురం జిల్లా బెళుగుప్ప మండల పరిధిలోని జీడిపల్లి రిజర్వాయర్‌కు నీళ్లు చేరాయి. నీళ్లు చేరిన సందర్భంగా హెచ్ఎన్ఎస్ఎస్ అధికారులు కృష్ణా జలాలకు జలపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జీడిపల్లి రిజర్వాయర్ డ్యాంకు 1179 క్యూసెక్కుల నీరు వస్తాయన్నారు. కృష్ణా జలాలను చూసేందుకు రైతులు, గ్రామస్తులు జీడిపల్లి రిజర్వాయర్ వద్దకు చేరుకున్నారు. నీరు రావడాన్ని చూసి రైతులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డిఈఈఎం రామసుబ్బయ్య, ఈఈజి శ్రీనివాసులు, ఎస్ఈ రాజస్వరూప్ కుమార్, సిఈ నాగరాజ, ఏఈఈ పృధ్వీ, రైతులు పాల్గొన్నారు.

జీడిపల్లి రిజర్వాయర్ వద్ద జలహారతి ఇస్తున్న హెచ్ఎన్ఎస్ఎస్ అధికారులు

అహుడా పనులను వేగవంతం చేయాలి

ఇన్‌ఛార్జి కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

అహుడా పరిధిలో ఉన్న పెండింగ్ పనులను సత్వరమే వేగవంతంగా పూర్తి చేయాలని ఇన్‌ఛార్జి కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ ఆదేశించారు. గురువారం ఉదయం తన క్యాంపు కార్యాలయంలో అహుడా ఛైర్మన్ టిసి.వరుణ్‌తో కలిసి అహుడా పని తీరుపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో ఉన్న ఎంఐజి లేఅవుట్ల భూముల సేకరణ పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో పెండింగ్ పనులను పరిశీలించి, అవసరమైన మేరకు తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇళ్ల నిర్మాణం అనంతరం ప్రజలు నివసించడానికి అనువైన మౌలిక సదుపాయాలు అందించగలిగే భూములను గుర్తించాలని తెలిపారు. ఉమ్మడి జిల్లాలోని పెనుగొండ, ధర్మవరం, మడకశిర, గుత్తి, కూడేరు, కోడూరు, కందుకూరు ప్రాంతాల్లో లేఅవుట్ల అభివృద్ధి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ స్పష్టంగా పేర్కొన్నారు. ఇప్పటివరకు జరిగిన అభివృద్ధి, ఇంజినీరింగ్ పనులు, ప్రభుత్వ ప్రయివేటు భూసేకరణలపై ఇంజినీరింగ్ తదితర విభాగాల అధికారుల ద్వారా వివరాలు తెలుసుకున్నారు. ప్లాట్ల కేటాయింపులో పారదర్శకంగా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. నగర కేంద్రాలకు దగ్గరగా ఉన్న అభివృద్ధి చేయదగిన నాణ్యమైన భూములపై అధికారులు దృష్టి సారించాలన్నారు. రోడ్లు, డ్రైయినేజ్ ఇతర ప్రాథమిక సదుపాయాలతో కూడిన ప్లాన్లను సిద్ధం చేసుకోవాలని సూచించారు. పనులను పూర్తి చేయడంలో ఏవైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని, వాటి పరిష్కారానికి అవసరమైన సహకారం అందిస్తామని ఇన్‌ఛార్జి కలెక్టర్ అధికారులకు తెలిపారు. ఈ సమావేశంలో అహుడా సెక్రటరీ రామకృష్ణారెడ్డి, ప్లానింగ్ అధికారి ఇషాక్, ఈఈ దుష్యంత్, జెపిఒ హరీష్ పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న ఇన్‌ఛార్జి కలెక్టర్, అహుడా ఛైర్మన్

పి-4 సర్వేకు బాలారిష్టాలు

ఓటీపీ చెప్పేందుకు ప్రజల నిరాకరణ

ప్రజాశక్తి-యల్లనూరు

ప్రభుత్వం చేపట్టిన పి-4సర్వేకు బాలారిష్టాలు పట్టుకున్నాయి. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఈ కార్యక్రమం అమలులో అధికారులను భాగస్వామ్యం చేసింది. దారిద్ర్యరేఖ దిగువ ఉన్న నిరుపేద కుటుంబాలను దత్తత తీసుకుని వారికి ఆసరాగా ఉండడం పి-4 ముఖ్య ఉద్దేశం. ఇందులో భాగంగా మండలంలో అధికారులు పి-4 సర్వేను పూర్తి చేశారు. మండల వ్యాప్తంగా 1495 కుటుంబాలు దారిద్ర్యరేఖకు దిగువన ఉన్నాయని గుర్తించారు. ఇక్కడి వరకు బాగానే ఉన్నా, గుర్తించిన వారి వివరాలు ఆన్‌లైన్ నమోదు చేయడం అధికారులకు కొత్త తలనొప్పులను తెచ్చిపెట్టింది.

ఓటిపి చెప్పేందుకు నిరాకరణ

బంగారు కుటుంబాల గుర్తింపులో భాగంగా వారి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాల్సి ఉంది. ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేయాలంటే సంబంధిత వ్యక్తి రిజిస్టర్ సెల్‌ఫోన్‌కు ఓటీపీ వస్తుంది. ఈ ఓటీపీ నెంబర్ చెబితేనే వారి వివరాలు నమోదు చేసేందుకు వీలుంటుంది. ఇటీవల సైబర్ మోసాలు అధికం అయిన నేపథ్యంలో ప్రజలు ఓటీపీ నెంబర్ చెప్పేందుకు నిరాకరిస్తున్నారు. చాలా మంది ఓటీపీ నెంబర్ చెప్పేందుకు నిరాకరిస్తుండడంతో అధికారులు వివరాలు నమోదు చేయలేకపోతున్నారు. దీంతో పి-4 నమోదు ప్రక్రియ ఆలస్యం అవుతోంది. ఇలాంటి పరిస్థితుల్లో పి-4ను ఎలా ముందుకు తీసుకెళ్లాలా అంటూ అధికారులు తలలుపట్టుకుంటున్నారు.

ప్లాస్టిక్ మహమ్మారి..!

- విచ్చలవిడిగా వినియోగం
- అక్టోబర్ 2లోగా సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధం..?
- ప్రభుత్వ నిర్ణయం అమలుపై సందేహాలు
- నామమాత్రపు తనిఖీలతో సరిపెడుతున్న అధికారులు

రోడ్డు పక్కన పడేసిన వినియోగించిన ప్లాస్టిక్ కవర్లు, గ్లాసులు

ప్రజాశక్తి-పెనుకొండ

పర్యావరణానికి హానికారిగా మారిన ప్లాస్టిక్ కట్టడిపై ప్రభుత్వం దృష్టి సారించింది. ఇందులో భాగంగా అధికారులు దుకాణాలపై ఇటీవల దాడులు నిర్వహించి ప్లాస్టిక్ వస్తువులు వినియోగించే వారికి జరిమానాలు విధిస్తున్నారు. పల్లెలు, పట్టణాలు అన్న తేడాలేకుండా అన్నిచోట్లా ప్లాస్టిక్ విచ్చలవిడిగా వినియోగంలో ఉంది. ఈ నేపథ్యంలో అక్టోబరు 2వ తేదీ నాటికి సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను పూర్తిస్థాయిలో నిషేధించాలన్న రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయించింది. ప్లాస్టిక్ నిషేధంలో భాగంగా రీ సైక్లింగ్, చెత్తను వేరుచేయడం వంటి ప్రక్రియను సంబంధిత అధికారులు వేగవంతం చేశారు. ఏళ్లుగా ప్లాస్టిక్ నిషేధం ఉన్నా, అమలులో అధికార యంత్రాంగం పూర్తిగా విఫలం అవుతోంది. విచ్చలవిడిగా సింగిల్ యూజ్ ప్లాస్టిక్ కవర్ల వినియోగం, క్రయవిక్రయాలు జరుగుతున్నా చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారు. ఈనేపథ్యంలో అక్టోబర్ 2వ తేదీ నాటికి సంపూర్ణ ప్లాస్టిక్ నిషేధం అమలవుతుందా? అన్నది ప్రశ్నార్థకంగా మారింది.

అవగాహన కల్పించడంలో అధికారులు విఫలం

ప్లాస్టిక్ వినియోగంపై అవగాహన కల్పించడంలో అధికారులు పూర్తిగా విఫలమయ్యారనే విమర్శలున్నాయి. అందుబాటులో ఉన్న ప్లాస్టిక్ వస్తువులు, పాలిథిన్ కవర్లు ఇతర సామగ్రిని నిషేధించేందుకు వ్యాపారులతో సమావేశం నిర్వహించాల్సి ఉంది. సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను తయారుచేసే యంత్రాలను తక్షణమే బ్యాన్ చేయాల్సుంది. ప్లాస్టిక్ వినియోగంతో తలెత్తే అనర్థాలపై ప్రజలకు పూర్తిస్థాయి అవగాహన కల్పించాల్సి ఉంది. ఈ చర్యలేవీ చేపట్టకుండా నిషేధం ఒట్టిమాట గానే మిగిలిపోతుంది.

సహకరించని వ్యాపారస్తులు

సింగిల్ యూజ్ వస్తువులు, పాలిథిన్ కవర్ల విక్రయదారులపై అధికారులు దాడులు చేసి జరిమానాలు విధించినా ప్లాస్టిక్ కవర్లు, ఇతరవస్తువులను విక్రయాలు ఆగలేదు. ప్లాస్టిక్ రహిత పట్టణంగా తీర్చిదిద్దేందుకు వ్యాపారులు, దుకాణదారులు, హోటల్స్, బేకరీ యజమానులు సహకరించని పరిస్థితి ఉంది. వ్యాపారులు, హోటల్ యజమానులు పాలిథిన్ కవర్ల వినియోగానికి దూరంగా ఉండడంలేదు. ఇటీవల కాలంలో దుకాణాలు, హోటళ్లపై దాడులు చేసి, ప్లాస్టిక్ కవర్లు, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తు వులు విక్రయిస్తున్న వారికి అధికారులు జరిమానాలు విధిస్తున్నా ఇవి పూర్తి స్థాయి ఫలితం ఇవ్వడం లేదు.

పెనుకొండలోని కాలువలో పేరుకుపోయిన ప్లాస్టిక్ కవర్లు, బాటిళ్లను తొలగిస్తున్న మున్సిపల్ సిబ్బంది(ఫైల్ ఫొటో)

విచ్చలవిడిగా వినియోగం

స్వచ్ఛ భారత్‌లో భాగంగా 2018లో టీడీపీ ప్రభుత్వం ప్లాస్టిక్ నిషేధాన్ని అమల్లోకి తీసుకువచ్చింది. అయితే ఇది అమలుకు నోచుకోలేదు. పట్టణాలు, మండలాల్లోని కాలువలు, డంపింగ్ యార్డుల్లో ప్లాస్టిక్ వ్యర్థాలు గుట్టల్లా పేరుకుపోయాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా దాదాపు అన్ని పట్టణాల్లో ప్లాస్టిక్ విని యోగం అధికంగా ఉంది. మండలా ల్లోనూ అదే పరిస్థితి కన్పిస్తోంది. ఎక్కడ చూసినా 80శాతం మేర సింగిల్ యూజ్ ప్లాస్టిక్ కవర్ల వ్యర్థాలే దర్శన మిస్తు న్నాయి. హోటళ్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లలోనూ సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగిస్తున్నారు. వేడివేడి ఆహార పదార్థాలను ఇందులో ప్యాక్ చేసి ఇవ్వడం ద్వారా ప్లాస్టిక్ వ్యర్థాలు శరీరంలో చేరి క్యాన్సర్‌కు కారకాలుగా మారుతున్నాయి. హానికరమైన ప్లాస్టిక్ నిషేధంపై అధికారులు తూతూమంత్రం చర్యలు కాకుండా పూర్తి స్థాయిలో చేపట్టాలనే డిమాండ్ ప్రజల నుంచి వ్యక్తం అవుతోంది.

పెనుకొండ నగర పంచాయతీ డంపింగ్ యార్డ్‌లో ప్లాస్టిక్ కవర్లను ఇతర వస్తువులను రీసైక్లింగ్ చేస్తున్న యంత్రం

క్యాన్సర్ బారినపడే ప్రమాదం

ప్లాస్టిక్ కవర్లు, పేపర్ల ద్వారా క్యాన్సర్ వచ్చే ప్రమాదం ఉంది. పర్యావరణానికి ముప్పు వాటిల్లుతుంది. హోటళ్లలో ఆహార పదార్థాల పార్శిళ్లను సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను వినియోగిస్తున్నారు. అవి వేడివేడి ఆహార పదార్థాల్లో కలిపి శరీరంలో క్యాన్సర్ కారకాలుగా మారుతున్నాయి.

మోహన్ నాయక్, వైద్యులు.

ఉత్పత్తిని నిలిపేయాలి

ప్రభుత్వాలు ప్లాస్టిక్ కవర్లు వాడరాదని ప్రజలపై ఒత్తిడి తెస్తోంది. దీనికంటే ప్రభుత్వమే ప్లాస్టిక్ కవర్ల తయారీని నిలిపేసేలా కఠిన నిర్ణయాలు తీసుకోవాలి. ప్రభుత్వాలు ప్లాస్టిక్ తయారు చేసే కంపెనీలను హెచ్చరించాలి. నామమాత్రపు చర్యలు తీసుకోవడం ద్వారా ఎలాంటి ప్రయోజనం లేదు.

రమేష్ నాయుడు, మునిమడుగు.

ఒంటరి మహిళపై లైంగిక వేధింపులు

సోషల్ మీడియాలో బయటపడ్డ బాగోతం
బాధితురాలి ఫిర్యాదుతో కేసు నమోదు

ప్రజాశక్తి-బ్రహ్మసముద్రం

ఒంటిరి మహిళపై కన్నేసిన ఓ వ్యక్తి ఆమె ఆవసరాన్ని ఆసరగా తీసుకుని లైంగిక వేధింపులకు పాల్పడ్డాడు. కుమార్తెకు కెజిబివి పాఠశాలలో సీటు ఇప్పించాలని అడిగినందుకు ఆమెతో అసభ్యంగా ప్రవర్తించాడు. ఈ విషయం సామాజిక మాధ్యమాల ద్వారా వెలుగు చూడడంతో బాధిత మహిళ ఫిర్యాదు మేరకు సదరు వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేసి అదుపులోకి తీసుకెళ్లారు. ఇందుకు సంబంధించి పోలీసులు, బాధిత మహిళ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి... బ్రహ్మసముద్రం మండలం నాగిరెడ్డికిపల్లికి చెందిన ఓ మహిళకు భర్త చనిపోయాడు. అప్పటి నుంచి తన కుమార్తెలు సౌజన్య, కావేరితో కలిసి తన పుట్టినిల్లు నాగిరెడ్డిపల్లి గ్రామంలో ఉంటోంది. ఇటీవల తన పెద్ద కుమార్తె సౌజన్య 5వ తరగతి పూర్తి చేసుకుంది. హాస్టల్‌లో ఉంటూ 6వ తరగతి చదివితే బాగుటుందని ఆమె భావించింది. ఈ క్రమంలో ఈమెపై బ్రహ్మసముద్రంకు చెందిన వన్నూరుస్వామి కన్నేశాడు. మహిళ కుమార్తెకు హాస్టల్ సీటు ఇప్పిస్తానని నమ్మబలికాడు. ఈ క్రమంలో ఆమె ఫోన్ నెంబర్ తీసుకున్నాడు. తాను చెప్తే కేజీబీవీలో సీటు ఇప్పిస్తానని చెప్పాడు. అయితే ఇందుకు రూ.10వేలు ఖర్చు అవుతుందని, అది ఇవ్వలేకపోతే తన కోరిక తీర్చాలంటూ అసభ్యంగా మాట్లాడాడు. ఇలా ఒకసారి కాదు.. పలుమార్లు ఫోన్ చేసి వేధించసాగాడు. అతని వేధింపులు అధికం కావడంతో బాధిత మహిళ గురువారం నాడు. బ్రహ్మసముద్రం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. స్పందించిన ఎస్ఐ నరేంద్రకుమార్ వేధింపులకు గురి చేస్తున్న వన్నూరుస్వామిని అదుపులోకి తీసుకున్నారు.

ఆన్‌లైన్‌ద్వారానే ప్రవేశాలు : ఎస్ఒ

కెజిబివి ప్రవేశాలు కేవలం ఆన్‌లైన్ ద్వారా భర్తీ చేస్తారని, దీనిపై దళారులు ఎవరినీ నమ్మొద్దని కెజిబివి ఎస్ఒ మహాలక్ష్మి తెలిపారు. సీటు విషయంలో మహిళకు జరిగిన లైంగిక వేధింపుల విషయాన్ని ప్రజాశక్తి ఎస్ఒ దృష్టికి తీసుకెళ్లగా ఆమె పై విధంగా స్పందించారు. తాము సీటు ఇప్పిస్తామని ఎవరైనా చెప్తే నమ్మొద్దన్నారు. డబ్బులిస్తే పనులు జరుగుతాయని కొందరు అసత్యప్రచారం చేస్తున్నారని, అలాంటి వారిపై చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు.

అభివృద్ధికి సహకరిస్తా తప్పా అడ్డుపడను

- ఎమ్మెల్యే విమర్శలు విడ్డూరం
- నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త రంగయ్య

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం టౌన్

మున్సిపాలిటీ అభివృద్ధికి తన వంతు సహకరిస్తా తప్పా అగ్గిపుల్లంతైనా అడ్డుపడనని మాజీ ఎంపి, నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త తలారి రంగయ్య స్పష్టం చేశారు. ఇటీవల మున్సిపల్ కౌన్సిల్ సమావేశాల విషయంలో, అభివృద్ధి విషయంలో పరస్పర విమర్శల నేపథ్యంలో గురువారం ఆయన పట్టణంలోని వైసిపి కార్యాలయంలో మున్సిపల్ ఛైర్మన్ రాజ్‌కుమార్, ఇతర కౌన్సిలర్లతో కలిసి విలేకరులతో మాట్లాడారు. మున్సిపాలిటీలో ఉన్న నిధులెంతో ఎమ్మెల్యే సురేంద్రబాబు ప్రభుత్వం నుంచి కొత్తగా తెచ్చిన నిధులెన్నో తెలుసుకుని కమిషనర్, కౌన్సిల్ సభ్యులతో కూర్చొని ఎజెండా తయారీకి సూచనలు ఇవ్వాల్సింది పోయి విమర్శలు చేయడం విడ్డూరంగా వుందన్నారు. నాకు అవకాశం ఇస్తే వైసిపి కౌన్సిలర్లను తీసుకెళ్లి నిధులు ఖర్చు పెట్టే విషయంలో సూచనలిస్తాం అన్నారు. అవసరమైతే వైసిపిని వీడి టిడిపిలో చేరిన కౌన్సిలర్లను కూడా కలుస్తామన్నారు. మొదట్లో ఎమ్మెల్యే ఏపని ప్రారంభించినా సొంత నిధులంటూ సొంత డబ్బా కొట్టుకున్నారని ఇప్పుడేమో కౌన్సిల్ సమావేశాలు జరగక నిధులు ఖర్చు చేయలేకపోతున్నామని పేర్కొనడం శోచనీయమన్నారు. మున్సిపల్ కమిషనర్ తన ఉద్యోగాన్ని మరచి రాజకీయాలు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. కౌన్సిల్ కింద పని చేయాల్సిన కమిషనర్ ఒక్కసారైనా ఛైర్మన్ ఛాంబర్‌కు వెళ్లి అభివృద్ధిపై చర్చించారా అని నిలదీశారు. అంతకుముందు ఆయన కౌన్సిలర్లు, వైసిపి నాయకులతో కలిసి పట్టణంలోని టి సర్కిల్‌లో జరుగుతున్న కల్వర్టు పనులను పరిశీలించారు.

మాట్లాడుతున్న వైసిపి సమన్వయకర్త రంగయ్య

స్మార్ట్‌మీటర్ల ఏర్పాటును అడ్డుకుంటాం

ప్రజాశక్తి-డి.హీరేహాల్

ప్రజలకు భారమయ్యే స్మార్ట్ మీటర్ల ఏర్పాటు నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకుని పాత విద్యుత్ మీటర్లనే కొనసాగించేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం డి.హీరేహాల్‌లో సిపిఎం మండల కార్యదర్శి లోకేష్ ఆధ్వర్యంలో గోడపత్రికలు విడుదల చేశారు. లోకేష్ మాట్లాడుతూ ఇప్పటికే ప్రజలపై అధిక విద్యుత్ ఛార్జీలు, ట్రూఅప్ ఛార్జీల పేరుతో మోయలేని భారాలు వేస్తున్నారన్నారు. ఇప్పుడు స్మార్ట్ మీటర్లు బిగించి మరింత భారాలు వేయడం సరికాదన్నారు. ఇకనైనా కూటమి ప్రభుత్వం ఎన్నికల వాగ్దానాలను అమలు చేయడంతో పాటు స్మార్ట్ మీటర్లను ఉపసంహరించుకొని ట్రూ అప్ ఛార్జీలు రద్దుచేసి విద్యుత్ ఛార్జీలను తగ్గించాలని డిమాండ్ చేశారు. లేనిచో భవిష్యత్తులో వినియోగదారులను సమీకరించి విద్యుత్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు వెంకటేశులు, వన్నూరుస్వామి, అంజని, శంకరప్ప, నాగేష్, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యాన శాఖ పథకాలను సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి-బ్రహ్మసముద్రం

ప్రభుత్వం ఉద్యానశాఖలో అమలు చేస్తున్న పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఉద్యాన అధికారి కృష్ణతేజ తెలిపారు. ఎంఐడిహెచ్, ఆర్‌కెవివై కింద ఫారం పాండ్లు, ప్యాక్ హౌస్‌లు, సోలార్ కోల్డ్ రూమ్స్, కోల్డ్ రూమ్స్ ,40- 50 శాతం రాయితీతో అందిస్తున్నారన్నారు. కొత్త తోటల విస్తరణ పథకం కింద మామిడి, చీనీ, దానిమ్మ, నేరేడు వంటి పంటలకు కూడా 40 శాతం రాయితీ వర్తిస్తుందన్నారు. పంట బీమా కింద ఎకరాకు (అరటి రూ. 3వేలు, టమోటా రూ. 1600, దానిమ్మ రూ. 3,750, చీనీ రూ. 2,750) ప్రీమియం చెల్లిస్తే అకాల వర్షాలు, వాతావరణంలో మార్పులు వల్ల పంట నష్టం జరిగితే రైతులకు బీమా వర్తిస్తుందని తెలిపారు. కావున రైతులు తప్పనిసరిగా ఈ-పంట నమోదు చేసుకోవడంతో పాటు ఈ నెలాఖరు లోగా ప్రీమియం చెల్లించాలన్నారు.

కులం పేరిట దూషించిన వ్యక్తిపై ఫిర్యాదు

ప్రజాశక్తి-రాయదుర్గం

విధి నిర్వహణలో ఉండగా కులం పేరుతో దూషించిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని మున్సి పాలిటీలో ఇంజినీరింగ్ విభాగంలో వాటర్ లైన్‌మెన్‌గా పని చేస్తున్న సురేష్ ఎస్ఐ ప్రసాద్‌కు విజ్ఞప్తి చేశారు. విధి నిర్వహణలో భాగంగా గురువారం తాను వాటర్ ట్యాంకర్‌ను మారెమ్మ గుడి రోడ్డులో తీసుకెళ్తుండగా రోడ్డుకు అడ్డంగా ఉన్న బైక్‌ను తీయమని చెప్పినందుకు ప్రసన్నకుమార్ అలియాస్ చిన్నా తనను కులం పేరుతో దూషించి చెప్పుకాలితో తన్ని కింద పడవేసి కొట్టాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. అతడిపై చర్య తీసుకోవాలని బాధితుడు సురేష్ ఎస్ఐను కోరారు.

చనిపోయిన జీవాల మాంసం విక్రయంపై దుమారం

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం టౌన్

పట్టణంలో ప్రజారోగ్యాన్ని నష్టపరిచే మటన్ విక్రయాలపై గురువారం దుమారం చెలరేగింది. మటన్ మార్కెట్‌లో ఓ మటన్ విక్రయదారుడు కుక్కలు కరిచి చనిపోయిన జీవాన్ని తీసుకొచ్చి విక్రయించేందుకు సిద్ధం చేయగా కొనుగోలు దారులు అడ్డుకుని బహిర్గతం చేశారు. తల మాంసం కోసం విక్రయదారుడిని కోరగా ఇది జవా చేయలేదని చెప్పడంతో అసలు విషయం వెలుగులోకి వచ్చింది. ఎక్కడో కుక్కలు కరిచి చనిపోయిన జీవాన్ని తీసుకొచ్చి ప్రజలకు విక్రయించేందుకు సిద్ధమై నట్లు బహిర్గతమైంది. ఆ తర్వాత కొనుగోలుదారుల ఫిర్యాదు మేరకు మున్సిపాలిటీ సిబ్బంది అక్కడికి చేరుకుని సదరు మాంసంపై లిక్విడ్ చల్లి విక్రయించకుండా నిరోధించారు. మటన్ మార్కెట్‌లో విక్రయదారులు ప్రజారోగ్యాన్ని దెబ్బతీసే మాంసాలను ప్రజలకు అమ్మడమే కాకుండా పట్టణంలోని హోటళ్లు, డాబాలకు సరఫరా చేస్తారని తెలియడంతో ఒక్కసారిగా ఆందోళన చోటుచేసుకుంది. ఇలాంటి మాంసం విక్రయాలను సంబంధిత అధికారులు అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

వృద్ధులకు ఇంటి వద్దకే రేషన్ ఇవ్వాలి

సమావేశంలో మాట్లాడుతున్న తహశీల్దార్ మునివేలు

ప్రజాశక్తి-బొమ్మనహాల్

65 ఏళ్లు దాటిన రేషన్ కార్డుదారులకు వారి ఇంటి వద్దకే వెళ్లి బియ్యం ఇతర నిత్యావసర సరుకులు పంపిణీ చేయాలని తహశీల్దార్ మునివేలు రేషన్ డీలర్లను ఆదేశించారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయ సమావేశ హాలులో గురువారం మండలంలోని రేషన్ డీలర్లతో సమావేశం నిర్వహించారు. తహశీల్దార్ మాట్లాడుతూ రేషన్ డీలర్లు ప్రతి నెలా 1 నుంచి 15వ తేదీ వరకూ రేషన్‌కార్డుదారులకు నిత్యావసర సరుకులు అందించాలన్నారు. 65 ఏళ్లు దాటిన రేషన్ కార్డుదారులు ఒక డీలర్‌కు 30 నుంచి 40 దాకా ఉంటాయి. వారికి తప్పనిసరిగా డోర్ డెలివరీ ఇవ్వాలన్నారు. అతిక్రమిస్తే చట్టపర మైన చర్యలు తప్పవని సూచించారు. కార్యక్రమంలో డీలర్ల సంఘం అధ్యక్షులు మోహన్, డీలర్లు పాల్గొన్నారు

27న ఎంఇఎఫ్ సదస్సు

రాయదుర్గం : ఈ నెల 27వ తేదీ కళ్యాణదుర్గంలో కళ్యాణదుర్గం, రాయదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల మాదిగ ఉద్యోగుల సమాఖ్య సదస్సు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ మేరకు గురువారం పట్టణంలో సదస్సు కరపత్రాలను సమాఖ్య ప్రతినిధులు విడుదల చేశారు. సదస్సుకు సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు బిక్షాలు, జాతీయ అదనపు ప్రధాన కార్యదర్శి బండారు శంకర్, జిల్లా అధ్యక్షులు రమేష్, తదితరులు హాజరవుతారని తెలిపారు. కార్యక్రమంలో ఎంఈఎఫ్ జిల్లా వర్కింగ్ ప్రెసి డెంట్ నగేష్, జిల్లా ఉపాధ్యక్షులు తిప్పేస్వామి, తాలూకా అధ్యక్షులు వన్నూరుస్వామి, ప్రధాన కార్యదర్శి ఎం.శ్రీనివాసులు, హనుమంతు, నాగేంద్ర పాల్గొన్నారు.

పాఠశాలకు మైక్‌సెట్ వితరణ

కళ్యాణదుర్గం టౌన్ : మండలంలోని పాలవాయి మోడల్ స్కూల్‌కు ఇదే పాఠశాల ఉపాధ్యాయుడు తిప్పేస్వామి మైక్‌సెట్ అందజేశారు. రూ. 12,500 విలువ చేసే అహుజా కంపెనీ మైక్‌సెట్‌ను గురువారం తిప్పేస్వామి హెచ్ఎం ఆనంద్‌బాబుకు అందజేశారు. దీంతో తిప్పేస్వామిని ఆ పాఠశాల ఉపాధ్యాయ బృందం, విద్యార్థుల తల్లిదండ్రులు అభినందించారు.

రైతుపై రెవెన్యూ సిబ్బంది దురుసు ప్రవర్తన

తహశీల్దార్‌కు ఫిర్యాదు

తహశీల్దార్‌తో మాట్లాడుతున్న రైతులు

ప్రజాశక్తి-కుందుర్పి

వన్-బి కోసం తహశీల్దార్ కార్యాలయానికి వస్తే అక్కడి సిబ్బంది దురుసుగా ప్రవర్తిస్తున్నారని, ప్రశ్నిస్తే కేసులు పెట్టిస్తామని బెదిరిస్తున్నారని మండలంలోని ఎన్.వెంకంపల్లి గ్రామానికి రైతు వెంకట రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. బ్యాంకులో పంట రుణాల రెన్యువల్ కోసం వన్-బి తీసుకోవడానికి మా తల్లిదండ్రులు తహశీల్దార్ కార్యాలయానికి వస్తే అక్కడున్న సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో పాటు ఎవరితో చెప్పుకుంటారో చెప్పుకోండి అంటూ దురుసుగా ప్రవర్తించారన్నారు. ఇదంతా సెల్‌ఫోన్ లో రికార్డ్ చేయగా సెల్‌ఫోన్ లాక్కొని, మీపై కేసులు నమోదు చేయిస్తామని బెదిరించారన్నారు. ఈ విషయంపై స్థానిక టిడిపి నాయకుడు తహశీల్దార్‌ను నిలదీయగా రైతు సెల్‌ఫోన్‌లో ఉన్న రికార్డులను తొలగించి రైతును హెచ్చరిస్తూ సెల్‌ఫోన్ వెనక్కు ఇచ్చినట్లు తెలిసింది. బాధిత రైతు వెంకటరెడ్డి మాట్లాడుతూ కార్యాలయంలో డబ్బులు ఇచ్చిన వారికి మాత్రమే పనులు వేగంగా జరిగిపోతాయి. సామాన్యులు, రైతులను కార్యాలయం చుట్టూ తిప్పుకుంటారు.. ఈ విషయమై తహశీల్దార్ శ్రీనివాసులును వివరణ కోరగా కంప్యూటర్ ఆపరేటర్ ఫోన్‌లో మాట్లాడుతున్న సమయంలో ఓ రైతు వన్-బి కోసం రాగా వారి మధ్య వాగ్వాదం జరిగింది. రైతు నుంచి సెల్‌ఫోన్ లాక్కున్న మాట వాస్తవమే. అయితే ఆ తర్వాత రైతుకి సెల్‌ఫోన్ ఇచ్చేశామని తెలిపారు.

చెత్త సేకరణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

బొమ్మనహాల్ : చెత్త సేకరణలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని ఎంపిడిఒ విజయభాస్కర్ హెచ్చరించారు. మండలంలోని దర్గాహొన్నూరు గ్రామంలో గురువారం చేపట్టిన చెత్త సేకరణ కార్యక్రమాన్ని ఎంపిడిఒ పర్యవేక్షించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఇంటి నుంచి తడి చెత్త, పొడి చెత్త వేర్వేరుగా సేకరించి అందులో నుంచి విలువైన చెత్తను రెండుగా విడదీసి సహజ సిద్ధమైన ఎరువులు తయారు చేయాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చినట్లు తెలిపారు. ఎక్కడైనా చెత్త ఉంటే దానిని పంచాయతీ కార్యదర్శి, గ్రీన్ అంబాసిడర్ ప్రణాళికాబద్ధంగా ప్రతిరోజూ సేకరించి పోగు చేయాలన్నారు. ఆయన వెంట పంచా యతీ ఇన్‌ఛార్జి కార్యదర్శి పల్లవి, గ్రీన్ అంబాజర్, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్‌పై ఫిర్యాదు

ప్రజాశక్తి-కణేకల్లు

స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ గురువారం పిడిఎస్‌యు ఆధ్వర్యంలో అనంతపురంలోని ఆర్ఐఒ కార్యాలయంలో వినతి పత్రం అందచేశారు. పిడిఎస్‌యు జిల్లా ప్రధాన కార్యదర్శి జి.వీరేంద్రప్రసాద్, ఉపాధ్యక్షులు మల్లెల ప్రసాద్, కోశాధికారి బండారు శంకర్ మాట్లాడుతూ కణేకల్లు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ కళాశాలకు కుర్చీలు అవసరమని చెప్పి ప్రతి విద్యార్థి తల్లిదండ్రుల నుంచి రూ. 5వేలు వసూలు చేస్తున్నారన్నారు. యూనిఫామ్‌కు ప్రభుత్వం నిర్ణయించిన ధర కంటే అదనంగా వసూలు చేస్తున్నారన్నారు. కళాశాలలో మరుగుదొడ్ల నిర్మాణ దశలోనే ఉన్నాయి, బెంచీలు, కుర్చీలు లేవు, ప్రహరీ లేదన్నారు. ఆయా సమస్యలను ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాల్సిన ప్రిన్సిపల్ ఇలా అనధికారికంగా వసూలు చేస్తూ ఆ సొమ్మును సొంతంగా వాడుకుంటున్నారని ఫిర్యాదు చేశారు. ఈ విషయాలపై ఉన్నతాధికారులు విచారణ చేపట్టి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు ఉదయ్, ఆనంద్, రాజు, తేజ, హనుమంతు పాల్గొన్నారు.

గుర్రం జాషువాకు నివాళి

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం టౌన్

గుర్రం జాషువా సమాజాన్ని మేల్కొల్పే కార్యక్రమాలు ఎన్నో చేపట్టారని పలువురు వక్తలు కొనియాడారు. పట్టణంలోని బాలుర వసతి గృహంలో గురువారం ఎంఇఒ శ్రీధర్, వార్డెన్ నాగరాజు ఆధ్వర్యంలో జాషువా వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ముందుగా వారు జాషువా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గుర్రం జాషువా చేసిన రచనలు సమాజానికి ఎంతో దోహదపడ్డాయని, అలాంటి వ్యక్తిని అందరూ ఆదర్శంగా తీసుకోవాలనారు. కార్యక్రమంలో తిప్పేస్వామి, ఎర్రిస్వామి, లక్ష్మన్న, ఉపాధ్యాయులు నగేష్, వినియోగదారుల సంఘం నాయకుడు కిషోర్, బిఎస్ఎన్ఎల్ ఇంజినీర్ నారాయణ, వెటర్నరీ అధికారి చిరంజీవి, తదితరులు పాల్గొన్నారు.

గర్రంజాషువా చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి
www.prajasakti.com

గుండెపోటుతో హోంగార్డు మృతి

హోంగార్డుకు నివాళులర్పిస్తున్న పోలీసులు

అనంతపురం క్రైం : జిల్లా పోలీస్ ఏఆర్ విభాగంలో పని చేస్తున్న హోంగార్డు పెద్దన్న గురువారం ఉదయం గుండెపోటుతో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న ఎస్పీ పి.జగదీష్ సంతాపం వ్యక్తం చేయడంతో పాటు అంత్యక్రియల ఖర్చుల కోసం రూ.10వేలు ఆర్థికసాయం అందించారు. స్థానిక అంబేద్కర్ నగర్‌లో ఉంచిన మృతదేహాన్ని ఏఆర్ డీఎస్పీ నీలకంఠేశ్వరరెడ్డి, ఆర్ఐ రాముడు, ఆర్ఎస్ఐ జాఫర్, తదితరులు సందర్శించి నివాళులర్పించారు.

సలకంచెరువు బ్యాంకు అధికారులపై చర్యలు తీసుకోవాలి

వ్యకాసం జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తి, సహాయ కార్యదర్శి భాస్కర్

ప్రజాశక్తి-శింగనమల

ప్రభుత్వ సంక్షేమ పథకాలు, ఉపాధి హామీ పథకానికి సంబంధించిన బిల్లులను రుణాలకు జమ చేసుకుంటున్న సలకంచెరువు బ్యాంకు అధికారులపై చర్యలుత తీసుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తి, జిల్లా సహాయ కార్యదర్శి భాస్కర్ డిమాండ్ చేశారు. ఈమేరకు గురువారం మండల పరిధిలోని సలకంచెరువు స్టేట్ బ్యాంకు మేనేజర్ బాలచంద్రుడును కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంక్షేమ పథకాలకు సంబంధించిన నగదు, ఉపాధి హామీ డబ్బులు, మరుగుదొడ్లకు సంబంధించిన బిల్లులు ఖాతాలకు జమ కాగానే గతంలోని రుణాలకు సరిజేసుకోవడం బాధకరమన్నారు. సంక్షేమ పథకాలకు చెందిన డబ్బులను రుణాలకు జమ చేసుకోకూడదని ప్రభుత్వం చెబుతున్నా పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. అంతేగాకుండా ఖాతాదారుల పట్ల బ్యాంకు సిబ్బంది సులకనభావంతో మాట్లాడటం తగదన్నారు. ప్రభుత్వం వెంటనే బ్యాంకు అధికారులపై చర్యలు తీసుకుని ఖాతాదారులకు న్యాయం చేయాలని, లేనిపక్షంలో శుక్రవారం సలకంచెరువు ఎస్‌బిఐ ముందు వంటావార్పు చేసి నిరసన తెలపనున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు సుంకన్న, రామాంజనేయులు, రామకృష్ణ, కుళ్లాయప్ప, చిన్నకాకోనప్ప, రామ్మోహన్, రాములమ్మ, నరసక్క, రామాంజనేయులు, లత, భాగ్య, సరస్వతి, నల్లమ్మ, ఆదినారాయణ, భూపాల్, ఆదిలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

ఈశ్వరమ్మ @ 103

వృద్ధాప్యంలో అమ్మకు సేవ చేస్తున్న బాలరాజు

ప్రజాశక్తి-పెద్దవడుగూరు

'శతమానం భవతి.. శతాయిష్మాన్ భవ' అని పెద్దలు దీవించడం మనం చూస్తూ ఉంటాం..అయితే ఈ అవ్వకి ఎవరి దీవెనలు ఫలించయో గాని.. 103 ఏళ్ల ఆయుష్షును తనలో నింపుకుంది. వందేళ్లు దాటినా ఇప్పటికీ ఉల్లాసంగా.. సంతోషంగా.. ఆరోగ్యంగా జీవిస్తోంది..

తల్లికి సేవ చేస్తున్న బాలరాజు

పెద్దవడుగూరులోని చేనేత కాలనీలో నివాసం ఉంటున్న మంగల ఈశ్వరమ్మకు 103 ఏళ్లు నిండినా ఆరోగ్యంగా ఉంటోంది. ఈశ్వరమ్మకు ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. ప్రస్తుతం కుమారుడు మంగళ బాలరాజు టిడిపిలో క్రియాశీలకంగా పని చేస్తున్నారు. అయితే తల్లికి రోజూ సపర్యలు చేసిన తర్వాతనే ఆయన బయటకు వచ్చేస్తారు. ఒకవేళ బాలరాజు పనిమీద బయటకు వెళ్తే.. ఆయన కుమారులు వృద్ధురాలికి సేవలు చేస్తారు. ఈశ్వరమ్మకు వందేళ్లు దాడినా ఎలాంటి జబ్బు సోకలేదు. రోజూ ఉదయం, రాత్రి మాత్రమే ఆహారం తీసుకుంటారు. తాను ఎక్కడికి వెళ్లినా తల్లికి సేవలు చేయడంలో నిర్లక్ష్యం చేయనని బాలరాజు చెబుతారు.

భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీలో నలుగురికి చోటు

అనంతపురం కలెక్టరేట్ : భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీలోకి జిల్లా నుంచి నలుగురిని ఎంపిక చేసుకున్నట్లు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి టి.రామాంజినేయులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 23, 24 తేదీల్లో గుంటూరులో నిర్వహించిన భవన నిర్మాణ కార్మిక సంఘం 8వ రాష్ట్ర మహాసభల్లో ఎన్నుకున్న రాష్ట్ర కమిటీలో జిల్లా నుంచి రాష్ట్ర సహాయ కార్యదర్శిగా టి.రామాంజనేయులు, రాష్ట్ర కమిటీ సభ్యులుగా టి.ప్రసాద్, కె.జాకీర్, ఎం.నాగలక్ష్మిలను ఎన్నుకున్నట్లు తెలిపారు. జిల్లాలో భవన నిర్మాణ కార్మికుల సమస్యల పరిష్కారినికి తమ వంతు కృషి అందిస్తామని, రాష్ట్ర కమిటికి సేవలు అందిస్తామన్నారు. తమను ఎన్నుకున్న రాష్ట్ర నాయకత్వానికి ధన్యవాదాలు తెలిపారు.

అచ్చుతానందన్‌కు నివాళులర్పిస్తున్న సిపిఎం నాయకులు

మాజీ సీఎం అచ్యుతానందన్‌కు నివాళి

గుత్తి : కేరళ మాజీ ముఖ్యమంత్రి, కమ్యూనిస్టు యోధుడు విఎస్.అచ్యుతానందన్‌కు గురువారం సిపిఎం ఆధ్వర్యంలో గుత్తిలో నివాళులర్పించారు. ఇందులో భాగంగా పట్టణంలోని అనంతపురం రోడ్డులో ఉన్న సిపిఎం కాలనీలో చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి వి.నిర్మల, సిఐటియు మండల అధ్యక్షుడు ఎం.మల్లేష్, డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు అశోక్, రాజేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

గ్రామస్తులతో విచారిస్తున్న ఆర్‌డిఒ, డీఎస్పీ

హుండీ మాయంపై విచారణ

ప్రజాశక్తి-నార్పల

మండల పరిదిలోని గూగూడు కుళ్లాయిస్వామి ఆలయంలో హుండీ ఏర్పాటు చేసిన హుండీ మాయంపై ఆర్‌డిఒ కేశవనాయుడు, డీఎస్పీ వెంకటేశులు గురువారం విచారణ చేపట్టారు. ఇటీవల జరిగిన కుళ్లాయిస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయంలో ఏర్పాటు చేసిన ఓ హుండీ గల్లంతైందని పత్రికలు, సామాజిక మాధ్యమాల్లో వార్తలు ప్రచురితమైన విషయం తెలిసిందే. ఇందుకు స్పందించిన ఆర్‌డిఒ, డీఎస్పీ గురువారం గ్రామానికి చేరుకుని ఇఒ సాకేతపురం శోభ, స్థానికులు, గ్రామపెద్దలను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆలయంలోని సీసీ పుటేజీలను పరిశీలించారు. తర్వాత హుండీ మాయం కాలేదని నిర్ధారించారు. అయితే సీసీ పుటేజీలు బహిర్గతం చేస్తారా.. లేదా.. అన్నది తెలపకపోవడం గమనార్హం. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి సాకేతపురం శోభ, సీఐ కౌలుట్లయ్య, ఎస్ఐ సాగర్, గూగూడు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

అంగన్వాడీ, రేషన్ దుకాణం తనిఖీ

మండల కేంద్రంలోని చింతవనం కొట్టాల అంగన్వాడీ కేంద్రంతోపాటు 37వ చౌకధాన్య దుకాణాన్ని ఆర్‌డిఒ కేశవనాయుడు గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా అంగన్వాడీ కేంద్రంలో అటెండెన్స్ రిజిస్టర్ పరిశీలించి అంగన్వాడీ టీచర్ విమలను విద్యార్థులకు అందిస్తున్న పౌష్టికాహారం వివరాలను అడిగతి తెలుసుకున్నారు. తర్వాత చౌకధాన్యం డిపోకు వచ్చి అంగన్వాడీ కేంద్రానికి ఇచ్చే బియ్యాన్ని చౌకధాన్యం డిపోలో పంపిణీ చేసే బియ్యాన్ని పరిశీలించి స్టాక్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈయనతోపాటు తహశీల్దార్ అరుణకుమారి, ఎంపిడిఒ మమతాదేవి, తదితరులు పాల్గొన్నారు.

పోస్టాఫీసుల్లో అక్రమాలపై చర్యకు డిమాండ్

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

పోస్టాఫీస్ అధికారితో మాట్లాడుతున్న సిపిఎం నాయకులు

మండల పరిధిలోని దయ్యాలకుంటపల్లి, కొర్రపాడు గ్రామాల్లో ఉన్న పోస్టాఫీసుల్లో జరిగిన అక్రమాలపై విచారణ చేయాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు గురువారం మండల కేంద్రంలోని మండల పోస్టాఫీస్ వద్ద సిపిఎం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి కుళ్లాయప్ప మాట్లాడుతూ దయ్యాలకుంటపల్లి గ్రామంలో 2020-24 మధ్య కాలంలో ఉపాధి హామీ పథకంలో రూ.24లక్షల అవినీతి జరిగిందని ఎపిడి విచారణలో తేలిందన్నారు. ఇందుకు పోస్టాఫీస్‌లో ఉండే సిబ్బంది ఫీల్డ్ అసిస్టెంట్‌కు సహకరించారని ఆరోపించారు. ఇంత జరుగుతున్నా పోస్టల్ సిబ్బందిపై అధికారులు ఎందుకు చర్యలు తీసుకోలేదని పోస్టల్ అధికారి మహేష్‌ను నిలదీశారు. పోస్టల్ అధికారి తనకు ఏమీ తెలియదు, గుర్తులేదని చెప్పడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. సిబ్బంది అక్రమాలకు పాల్పడుతుంటే బాధ్యత లేకుండా మాట్లాడతారా.. అంటూ నిలదీశారు. ఈ విషయంపై త్వరలోనే పెద్దఎత్తున ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు నాగేంద్ర, నెట్టికల్లు, పుల్లయ్య, రఫీ, కార్యకర్తలు పాల్గొన్నారు.

రిజిస్టర్ దస్తావేజు పోయినది

తాడిపత్రి సబ్ రిజిస్టర్ సరిధిలో 13-10-1988వ తేదీన రిజిస్టర్ కాబడిన **దస్తావేజు నెంబరు:3011/1988**గా అన్నపూర్ణమ్మ పేరున రిజిస్టర్ కాబడినది. ఈ దస్తావేజులు తాడిపత్రి పరిధిలో పోయినవి. ఎవరికైన దొరికిన యెడల తాడిపత్రి పోలీస్ స్టేషన్‌లో గాని, అన్నపూర్ణమ్మ కుమారులమైన హరికుమార్ అయిన నా ఫోన్ **నెంబర్: 9849600035 కు** తెలియజేయగలరని ప్రార్థన.

IN THE COURT OF THE. JUNIOR CIVIL JUDGE TADIPATRI
O.S NO:139/2023

Between:
Andhra Pragathi Grameena Bank, Represented by its Branch Manager,Tadipatri **... Plaintiff**
AND
Sinaganamala Anjineyulu and another **...Defendants**

Notice to the Defendant No:1

D1: Sinaganamala Anjineyulu s/o Subbaiah, D.No 4-327, Ragithotapalem, Tadipatri Town, Anantapuramu District.

పై నెంబరు కేసులో Defendant అయిన మీ హాజరు నిమిత్తము 13-08-2025వ తేది ఉదయం 10:30 గంటలకు వాయిదా వేసినారు. ఆ రోజు మీరు స్వయంగా గానీ లేక వకీలు ద్వారా గానీ పై కోర్టులో హాజరై ఏమైన ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని యెడల పై కేసు మీ పరోక్షమున తీర్మానించెదరు.

(By order of the court)
G. KESAVAIAH,
Advocate, Anantapuramu
cell: 9440606489

In the Court of the III rd Addl. Junior Civil Judge (Excise Court) Anantapuramu
O.S NO:1200/2023

Between:
M.Rama Devi **... Plaintiff**
AND
Y.Venkata Reddy @ Dadithota Venkata Reddy and another **...Defendants**

Notice to the Defendant No:2

D2: Y. ANIL SAMARA REDDY, S/o. Y.Venkata Reddy@ Dadithota Venkata Reddy, Residing at D.NO.3/123, II Road, Anantapuramu

పై నెంబరు కేసులో Defendant అయిన మీ హాజరు నిమిత్తము 19-08-2025వ తేది ఉదయం 10:30 గంటలకు వాయిదా వేసినారు. ఆ రోజు మీరు స్వయంగా గానీ లేక వకీలు ద్వారా గానీ పై కోర్టులో హాజరై ఏమైన ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని యెడల పై కేసు మీ పరోక్షమున తీర్మానించెదరు

(By order of the court)
L.K.SUDHEENDRANATH,
M.A.NAGESWARI,
Advocates, Anantapuramu

In the Court of the Addl. Senior Civil Judge Anantapuramu
O.S NO:25/2023

Between:
R.V.Prasad **... Plaintiff**
AND
A.Renuka Devi (Died) by L.Rs k.Manasa **...Defendant**

Notice to the Defendant

To,
K.Manasa W/o Dileep D/o A.Renuka Devi R/oD.No: 102, Upstairs, 1-1058-B, Rudrampeta Bypass, Alamur Road, Anantapur.

పై నెంబరు కేసులో Defendant అయిన మీ హాజరు నిమిత్తము 31-07-2025వ తేది ఉదయం 10:30 గంటలకు వాయిదా వేసినారు. ఆ రోజు మీరు స్వయంగా గానీ లేక వకీలు ద్వారా గానీ పై కోర్టులో హాజరై ఏమైన ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని యెడల పై కేసు మీ పరోక్షమున తీర్మానించెదరు.

(By order of the court)
N.R.K.Mohan,
ADVOCATE ANANTAPUR
Cell no: 9440787100

తాడిపత్రి జూనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో
O.S. No. 208/2023

Between:
జి. నాగరాజు **...వాది**
మరియు
చల్లా నరేష్ అలియాన్ నరేష్ నాయుడు **...ప్రతివాది**
To,
చల్లా నరేష్ అలియాన్ నరేష్ నాయుడు తండ్రి చల్లా నరసింహులు, చల్లావారిపల్లి గ్రామం, తాడిపత్రి మండలం, అనంతపురం జిల్లా.

ప్రతివాదికి కోర్టు సమన్లు

పై దావాలో వాది మీ పైన ప్రామిసరీ నోటు దావా పై కోర్టులో దాఖలు చేసి ఉంటున్నారు. కోర్టు వారు మీ పై పబ్లికేషన్ ద్వారా సమన్లు జారీ చేసి వాయిదా 28-07-2025వ తేదీన పై కోర్టులో వేసి ఉంటున్నారు. కావున మీరు పై తేదీన పై కోర్టులో ఖుద్దునగానీ, వకీలు ద్వార గానీ హాజరు అయి అభ్యంతరములు తెలుపుకోవచ్చును. లేని యెడల కోర్టు వారు పై దావాను పరోక్షములో తీర్మాణించెదరు.

(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

ఇట్లు
వి.మునెయ్య
వాదితరపు వకీలు

తాడిపత్రి జూనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో
O.S. No. 209/2023

Between:
జి. నాగరాజు **...వాది**
మరియు
చల్లా నరేష్ అలియాన్ నరేష్ నాయుడు **...ప్రతివాది**
To,
చల్లా నరేష్ అలియాన్ నరేష్ నాయుడు తండ్రి చల్లా నరసింహులు, చల్లావారిపల్లి గ్రామం, తాడిపత్రి మండలం, అనంతపురం జిల్లా.

ప్రతివాదికి కోర్టు సమన్లు

పై దావాలో వాది మీ పైన ప్రామిసరీ నోటు దావా పై కోర్టులో దాఖలు చేసి ఉంటున్నారు. కోర్టు వారు మీ పై పబ్లికేషన్ ద్వారా సమన్లు జారీ చేసి వాయిదా 28-07-2025వ తేదీన పై కోర్టులో వేసి ఉంటున్నారు. కావున మీరు పై తేదీన పై కోర్టులో ఖుద్దునగానీ, వకీలు ద్వార గానీ హాజరు అయి అభ్యంతరములు తెలుపుకోవచ్చును. లేని యెడల కోర్టు వారు పై దావాను పరోక్షములో తీర్మాణించెదరు.

(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

ఇట్లు
వి.మునెయ్య
వాదితరపు వకీలు

బహిరంగ ప్రకటన

ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయడం ఏమనగా డి.నరేంద్ర తండ్రి:డి.వెంకటస్వామి, నివాసం, డోర్ నెం:8-212, కొట్టాలపల్లి గ్రామం, బుక్కరాయసముద్రం మండలం, అనంతపురం జిల్లా అనువారు ఈ క్రింది షెడ్యూలు దాఖలా ఆస్తిని 1).కూలూరు లక్ష్మీదేవి భర్త:లేట్ కూలూరు చిన్న సుబ్బిరెడ్డి, 2).కూలూరు సుబ్బిరెడ్డి, తండ్రి:లేట్ కె.చిన్న సుబ్బిరెడ్డి 3) కూలూరు చిన్న సుబ్బి రెడ్డి తండ్రి:లేట్ చిన్న సుబ్బి రెడ్డి నివాసం:కొట్టాలపల్లి గ్రామం, బుక్కరాయసముద్రం మండలం గార్లతో డి.నరేంద్ర తేది:03-06-2024వ తేది డాక్యుమెంటు నెం:22780/2024 ద్వారా కొనుగోలు చేసి విక్రయ రిజిష్టరు చేసు కొన్నారు. అయితే డి.నరేంద్ర గారు ఈ క్రింది షెడ్యూలు దాఖలా ఆస్తిని మా క్లయింటు అయిన AU SMALL FINANCE BANK, Ananthapur నందు ఆయకం వుంచి ఋణమును పొందవలెనని అనుకొన్నారు. కావున ఎవరికైన ఈ క్రింది షెడ్యూలు దాఖలా ఆస్తిని గురించి ఎలాంటి విక్రయాలు కానీ, ఆయకములు కానీ, లీజులు కానీ లేదా తకరార్లు గానీ వున్నచో ఈ ప్రకటన వెలువడిన 7 రోజుల లోపల నాకు గానీ నా క్లయింటు AU SMALL FINANCE BANK, Ananthapur నకు తెలియచేయగలరు.

షెడ్యూలు

అనంతపురం రి॥డి అనంతపురం సబ్॥డి॥కి చేరిన బుక్కరాయసముద్రం గ్రామ పొలం సదరు పంచాయితీ ఏరియాలోని ఆస్తి వివరం:

బాబు వివరం సర్వే నెం. ఎ.సి, ఎ.సి, హెచ్.యస్
సర్కారు ఖుష్కి 108/3 0.78 పైకి 0.02.54 0.010

చెక్కుబంది: **తూర్పు**:రోడ్డు, **దక్షిణం**: బోయ శివకుమార్ గారి జమీన, **పడమర**: పేర్ల రామాంజినేయులు రెడ్డి గారి జమీన **ఉత్తరం**: రోడ్డు, **కొలతలు**:**తూర్పు-పడమర**: 41 అ॥లేక 12.5 మీటర్లు, **ఉత్తరం-దక్షిణం**: 27 అ॥లేక 8.23 మీటర్లు

పెరవలి శరత్‌బాబు, అడ్వకేట్,
అనంతపురం. సెల్:9440508551, 8639444475.

డ్రైయినేజీ సమస్యలు పరిష్కరించాలి : సిపిఎం

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

వినతిపత్రం అందజేస్తున్న సిపిఎం నాయకులు

మండల కేంద్రం సమీపంలోని గాంధీనగర్ ఎడమవైపు ఉన్న బ్రాందీషాపు చివర ఉన్న రెండు వీధుల్లో డ్రెయినేజీతోపాటు మంచినీరు, వీధిదీపాల సమస్యలు పరిష్కరించాలని సిపిఎం మండల కార్యదర్శి ఆర్.కుళ్లాయప్ప డిమాండ్ చేశారు. ఆయా సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సిపిఎం ఆధ్వర్యంలో గురువారం మండల పరిధిలోని గాంధీనగర్‌లో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గాంధీనగర్ కాలనీలో దాదాపు 250కిపైగా కుటుంబాలు నివాసం ఉంటున్నాయన్నారు. నార్పల రోడ్డు ఎడమ వైపున ఉన్న బ్రాందీ షాపునకు చివరి రెండువీధుల్లో డ్రెయినేజీ కాలువల్లో పూడిక పేరుకుపోయి ప్రజలు తీవ్రం ఇబ్బందులు పడుతున్నారు. అంతేగాకుండా కాలనీకి మంచినీటి సమస్య తీవ్రంగా ఉందన్నారు. ఇక్కడ ఉన్న చిన్న ట్యాంకుకు నీళ్లు రావడం లేదన్నారు. చేతి పంపు సరిగా పని చేయడం లేదన్నారు. అలాగే వీధి దీపాలు లేకపోవడంతో రాత్రిళ్లు ఇళ్లలోని విష సర్పాలు వస్తున్నాయన్నారు. తక్షణమే ఆయా సమస్యలు పరిష్కరించాలని, లేనిపక్షంలో ఆందోళనలను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. అనంతరం పంచాయితీ కార్యదర్శి శ్రీనివాసులుకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి సి.నాగేంద్ర, మండల కమిటీ సభ్యులు కె.నెట్టికంటయ్య, పుల్లయ్య, చెన్నప్ప, నడిపక్క వెంకటలక్ష్మి, ఉమా, సావిత్రి, దుర్గ, మల్లికార్జున, గంగాధర్, గంగయ్య, అరవింద్, రఫీ, తదితరులు పాల్గొన్నారు.

మోటారు చోరీపై నిర్లక్ష్యం తగదు : సిపిఎం

చోరీ జరిగిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి-గుంతకల్లు

సమ్మర్ స్టోరేజీ ట్యాంకు వద్ద నీటి పంపింగ్ కేంద్రంలో ఉన్న 240 హెచ్‌పి మోటారును గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేయడం మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని సిపిఎం పట్టణ కార్యదర్శి మారుతీప్రసాద్ అన్నారు. స్థానిక సమ్మర్ స్టోరేజీలోని పంపింగ్ కేంద్రాన్ని సిపిఎం నాయకులు గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలోని రిజర్వాయర్‌కు నీటిని పంపింగ్ చేసే మోటార్‌ను ఆగంతకులు చోరీ చేయడంపై పలు అనుమానాలకు తావిస్తోందనాన్రు. సుమారు ఒకటిన్నర టన్ను బరువు ఉన్న మోటారును దొంగలిస్తుంటే అధికారులు ఏం చేస్తున్నారని రనపశ్నించారు. ఈ చోరీ ముమ్మాటికీ మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యమే అన్నారు. వెంటనే మోటారు చోరీ నిందితులను పట్టుకుని శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పట్టణ కార్యదర్శివర్గ సభ్యులు జగ్గిలి రమేష్, సాకే నాగరాజు, సురేంద్రబాబు, కమిటీ నాయకులు రామునాయక్, అబ్దుల్లా, తిమ్మప్ప, ప్రసాద్, సుదీప్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజలను మభ్యపెట్టడానికే 'సుపరిపాలన' గొప్పలు

వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం

రాష్ట్ర ప్రజలను మభ్య పెట్టడానికే కూటమి ప్రభుత్వం 'సుపరిపాలనలో తొలిఅడుగు' అంటూ గొప్పలు చెప్పుకుంటోందని వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి విమర్శించారు. గురువారం అనంతపురంలోని 8వ డివిజన్ పరిధిలో 'బాబు షూరిటీ-మోసం గ్యారంటీ' కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి కూటమి మేనిఫెస్టోను వివరిస్తూ ఏడాదిగా ప్రజలకు ఎంత మేరకు నష్టం జరిగిందో క్యూఆర్ కోడ్ సాయంతో వివరించారు. ఈ సందర్భంగా ఆమన మాట్లాడుతూ చంద్రబాబు ఏడాది పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా సుపరిపాలన అందించామని కూటమి నేతలు చెబుతూ ప్రజల వద్దకు వెళ్తున్నారు. ఇదే సమయంలో మేం చంద్రబాబు మేనిఫెస్టోను గుర్తుకు చేస్తూ తాము 'మోసం గ్యారంటీ' కార్యక్రమం చేపట్టామన్నారు. ముఖ్యంగా కూటమి ప్రభుత్వం వచ్చి 13 నెలలు దాటినా రైతులకు అన్నదాత సుఖీభవ, ఆడబిడ్డ నిధి కింద ప్రతినెలా రూ.1500 అందించలేదని మండిపడ్డారు. వీటితోపాటు సూపర్ సిక్స్ హామీలకు మంగళం పాడుతున్నారన్నారు. సంక్షేమ పథకాలు అమలు చేయలేని చంద్రబాబు కక్షసాధింపు రాజకీయాలు చేస్తున్నారు. అక్రమ కేసులు, అరెస్టులు చేస్తున్నారు. ఇలాంటి వాటికి భయపడమని, ప్రజల పక్షాన పోరాడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నగర అధ్యక్షులు చింతా సోమశేఖర్‌రెడ్డి, నాయకులు రమేష్‌గౌడ్, అమర్నాథ్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



వృద్ధురాలితో మాట్లాడుతున్న వైసిపి నాయకులు

పుట్లూరు : మండలంలోని రంగరాజుకుంట, కుమ్మనమల, రంగినేపల్లి, కొండగారికుంట గ్రామాల్లో గురువారం 'బాబు షూరిటీ-మోసం గ్యారంటీ' కార్యక్రమంలో నిర్వహించారు. ఇందులో భాగంగా మండల వైసిపి మండల కన్వీనర్ పొన్నపాటి మహేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఇంటింటికీ వెళ్లి చంద్రబాబు మేనిఫెస్టో క్యూఆర్ కోడ్ పత్రాన్ని ప్రజలకు అందజేస్తూ మోసపు హామీలను వివరించారు. ఈ కార్యక్రమంలో వైసిపి జిల్లా కార్యదర్శి రమణయాదవ్, నాయకులు నరసింహారెడ్డి, ఎంపిటిసి లక్ష్మీరంగమ్మ, సర్పంచు శ్రీదేవి, నాయకులు మడ్డిపల్లి ప్రభాకర్‌రెడ్డి, పొన్నపాటి రామాంజనరెడ్డి, సూర్యనారాయణరెడ్డి, నారాయణస్వామి, పెద్దిరాజు, రామకృష్ణ, మారుతి, తదితరులు పాల్గొన్నారు.

'సోలార్' సబ్సిడీని సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి-శింగనమల

ప్రధానమంత్రి సూర్యఘర్ యోజన పథకం కింద వస్తున్న సబ్సిడీని గృహ వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ సూచించారు. గురువారం ఎల్విన్ ఎనర్జీ సంస్థ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ప్రధానమంత్రి సూర్యఘర్ యోజన పథకంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఇళ్ల పైకప్పులపై సౌర ఫలకాలు ఏర్పాటు చేసుకుని సౌర విద్యుత్ పొందడానికి ప్రధానమంత్రి సూర్య ఘర్ యోజన పథకాన్ని తీసుకొచ్చారన్నారు. ఎస్సీ, ఎస్టీలకు ఉచితంగా సోలార్ ఫలకాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. మిగిలిన సామాజిక వర్గాలకు సబ్సిడీపై అందజేయనున్నట్లు తెలిపారు. వీటిని గృహ వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎడిసిసి బ్యాంకు ఛైర్మన్ ముంటిమడుగు కేశవరెడ్డి, టిడిపి సీనియర్ నాయకులు ఆలం నరసానాయుడు, లాయర్ ఈశ్వర్‌రెడ్డి, మండల కన్వీనర్ గుత్తా ఆదినారాయణ, సింగిల్‌విండో ఛైర్మన్ గుర్రం లక్ష్మీనారాయణ, నాయకులు మారుతీనాయుడు, అట్టే రామాంజనేయులు, ఆదినారాయణ సత్యనారాయణ, మాసూలు చంద్రమోహన్, చాకలి వెంకటేష్, అనిల్‌కుమార్, రమేష్, కాయగూరల సత్తి, ఎంపిడిఒ భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి వార్తకు స్పందన

శుభ్రం చేస్తున్న జెసిబి

పాఠశాల మైదానం శుభ్రం

పుట్లూరు : ఎట్టకేలకూ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానాన్ని అధికారులు గురువారం శుభ్రం చేశారు. 'కూలిన గ్రౌండ్ కాంపౌండ్ వాల్' అనే శీర్షిక ఈనెల 19వ తేదీన ప్రజాశక్తి దినపత్రికలో కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. ఇందుకు స్పందించిన ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ వెంటనే పాఠశాల మైదానాన్ని శుభ్రం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ అలివేలమ్మ ఆధ్వర్యంలో గురువారం జెసిపి సాయంతో పాఠశాల మైదానాన్ని శుభ్రం చేశారు. దీనికితోడు ప్రహరీ కూలిన చోట కంపతో అడ్డం వేశారు. దీంతో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు ప్రజాశక్తి దినపత్రికకు కృతజ్ఞతలు తెలిపారు.

నేరాలు ఘోరాలు

హత్యకేసులో నిందితులు అరెస్టు

తాడిపత్రి : ఈనెల 14న రాత్రి పట్టణంలోని పుట్లూరు రోడ్డులో జరిగిన హరి హత్యకేసులో నిందితులను అరెస్టు చేసినటు తాడిపత్రి టౌన్ ఇన్స్‌పెక్టర్ సాయి ప్రసాద్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు... హత్య జరిగిన రోజు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తుండగా నిందితులను పట్టణంలోని నందలపాడు ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద గురువారం అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. నిందితులను గాండ్లపాడు అజయ్, మెట్ల దీపక్, గూడూరు హేమంత్‌కుమార్, అల్లుదుర్గా నవీన్, రామ గణేశ్, బోసి వెంకట పరమేష్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా గోగుల నాగరాజుకు, హరీష్‌కు మధ్య ఆధిపత్య పోరు కారణంగా హత్య చేసినట్లు నిందితులు తెలిపారన్నారు. మరో ముగ్గురు నిందితులు పరారీలో ఉన్నట్లు వివరించారు.

కొడవలితో దాడి..ఇద్దరికి గాయాలు

బెలుగుప్ప : ఓ విశ్రాంత ఎఆర్ ఎఎస్ఐ కొడవలితో దాడి చేయడంతో ఇద్దరు గాయపడిన ఘటన గురువారం చోటు చేసుకుంది. కనేకల్లు మండలం హానకనహల్ గ్రామానికి చెందిన ఎస్‌కె యోగేశ్వర్‌రెడ్డికి చెందిన 98/2 సర్వే నెంబర్‌లో మూడెకరాల పొలాన్ని ఆవులెన్న గ్రామానికి చెందిన రైతు నాగరాజు కౌలుకు తీసుకుని వ్యవసాయం చేస్తున్నాడు. ఈనేపథ్యంలో వర్షం కురవడంతో గురువారం పొలంలో విత్తనం వేస్తుండగా తన పొలం అంటూ అనంతపురానికి చెందిన విశ్రాంత ఎఆర్ ఎఎస్ఐ కృష్ణకుమార్ వచ్చి అడ్డుకున్నాడు. దీంతో కందులు ఇత్తుతున్న ట్రాక్టర్ డ్రైవర్ అశోక్‌కుమార్ కుడిచేతిపై కొడవలితో దాడి చేయగా అతనికి అడ్డుగా వచ్చిన మహిళా రైతు నాగలక్ష్మిపై నానా దుర్భాషలాడుతూ ఆమెపై కూడా గొడ్డలితో దాడి చేయడంతో చేతి వేళ్లు గాయపడ్డాయి. వెంటనే క్షతగాత్రులను కళ్యాణదుర్గం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. దౌర్జన్యానికి పాల్పడుతూ ఇద్దరిని గాయపరిచిన కృష్ణకుమార్‌పై చర్యలు తీసుకోవాలని బెలుగుప్ప పోలీస్‌స్టేషన్‌లో మహిళా రైతు నాగలక్ష్మి భర్త నాగరాజు ఫిర్యాదు చేశారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము
క్వాలిటి అస్సురేన్స్ మరియు క్వాలిటి కంట్రోల్ డివిజన్ కార్యాలయము
పంచాయతి రాజ్, అనంతపురం
చిట్ టెండర్ ప్రకటన నెం.01/ఏ.టి.ఒ/2025-26 తేది:23.07.2025

కార్యనిర్వాహక ఇంజనీరు, **క్వాలిటి అస్సురెన్స్ మరియు క్వాలిటి కంట్రోల్**, పంచాయతీరాజ్ డివిజన్ కార్యాలయము. ఉమ్మడి అనంతపురం జిల్లా పరిధి నందు జరిగిన పనులను ఎక్జిక్యూటివ్ ఇంజనీర్ మరియు డిప్యూటీ ఎక్జిక్యూటివ్ ఇంజనీర్ వారి ఆధ్వర్యంలో పర్యవేక్షించుటకు గాను అర్హత కలిగిన వాహనము (ఎ.సి) ఇన్నోవా, మహేంద్ర, తవేరా, బొలేరో, తరహా వాహనముల యజమానుల నుండి టెండరులు ఆహ్వానించడమైనది. జి.ఓ.యం.యస్. నెం:87 తేది:01-06-2017 ఫైనాన్స్ (MR-II TFRUA) ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము నందు తెలుపబడిన నిబంధనలు ప్రకారము టెండరు జరుపబడును. ఆసక్తి ఉన్న వాహన యజమానుల నుండి సీల్డ్ వేసిన టెండరులు ఆహ్వానించబడుచున్నవి. టెండరు షెడ్యూలు కొరకు దిగువ తెలిపిన డివిజన్ కార్యాలయము & సబ్-డివిజన్ కార్యాలయయులందు సంప్రదించవలెను.

టెండరు షెడ్యూలు కొరకు దరఖాస్తు స్వీకరించు తేది:	26-07-2025 సాయంత్రం 05:00 గంటల వరకు
టెండరు షెడ్యూలు జారీ చేయు తేది:	28-07-2025 సాయంత్రం 05:00 గంటల వరకు
టెండరు షెడ్యూలు స్వీకరించు తేది:	30-07-2025 సాయంత్రం 03:00 గంటల వరకు
మరియు టెండరు తెరుచు తేది:	30-07-2025 మధ్యాహ్నం 03:30 గంటల వరకు

డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్
క్వాలిటి అస్సురేన్స్ మరియు క్వాలిటి కంట్రోల్,
సబ్-డివిజన్, అనంతపురము-1 & 2
కదిరి మరియు పెనుకొండ

కె.మల్లికార్జున మూర్తి
కార్యనిర్వాహక ఇంజనీర్
క్వాలిటి అస్సురేన్స్ మరియు క్వాలిటి కంట్రోల్
(పి.ఆర్) డివిజన్, అనంతపురము

రైతాంగాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి

ప్రజాశక్తి-గుత్తి

వర్షాభావంతో సాగుచేసిన పంటల దిగుబడులు రాక నష్టాల్లో కూరుకుపోయిన రైతులను కూటమి ప్రభుత్వం ఆదుకోవాలని వైసిపి ఐటి విభాగ జిల్లా అధ్యక్షుడు వై.రాజశేఖర్ రెడ్డి, వైసిపి మాజీ మండల అధ్యక్షుడు జి.గోవర్ధన్‌రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలో వైసీపీ నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ ఏడాది సకాలంలో వర్షాలు రాక చాలామంది రైతులు విత్తనాలు వేయలేదన్నారు. అరకొర పదునులో వేసిన విత్తనాలు మొలకెత్తక రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. పండ్లు, కూరగాయల రైతులకు గిట్టుబాటు ధర లేక తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. అన్నదాత సుఖీభవ నిధులు విడుదల చేయాలన్నారు. రైతులకు పంటల బీమా, ఇన్‌పెట్ సబ్సిడీ ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో వైసిపి మండల ఉపాధ్యక్షుడు రఘునాథ్‌రెడ్డి, రైతు విభాగం నాయకులు రామరంగారెడ్డి, గోపాల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అనంతలో 'షైన్' ప్యూర్ సిల్వర్ జ్యువెల్లరీ

అందుబాటులోకి అద్భుతమైన మోడళ్లు - మేనేజింగ్ డైరెక్టర్ చెక్కా మంజునాథ్

ప్రజాశక్తి-అనంతపురం

నగరంలోని రాజు రోడ్డులో ఏర్పాటు చేసిన 'షైన్' ప్యూర్ సిల్వర్ జ్యువెలరీ మహిళలకు అద్భుతమైన మోడళ్లను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు మేనేజింగ్ డైరెక్టర్ చక్కా మంజునాథ్ అన్నారు. ఈ సందర్భంగా ప్రజాశక్తితో ఆయన మాట్లాడుతూ మహిళలు, పిల్లలు, పెద్దలకు సంబంధించిన అన్నిరకాల సిల్వర్ మోడళ్లను అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. సుదీర్ఘ కాలం అనుభవంతో అందరికీ అందుబాటు ధరల్లో సిల్వర్ ఐటమ్స్ లభిస్తున్నట్లు చెప్పారు. ఓల్డ్ సిల్వర్ ఎక్చేంజ్‌పై మంచి ఆఫర్లతో కొత్త మోడల్స్ అందిస్తున్నట్లు వివరించారు. అంతేగాకుండా 'షైన్' ప్యూర్ సిల్వర్ జువెలరీ మొబైల్ యాప్ ద్వారా వేలాది సరికొత్త మోడల్స్ ఆహ్వానం పలుకుతోందన్నారు. ఎంపిక చేసిన మోడళ్లపై 50 శాతం వరకు డిస్కౌంట్స్ ఇస్తున్నట్లు తెలిపారు. మహిళల కోసం ప్రత్యేకంగా నెలవారి స్కీమ్‌లు ఉన్నాయన్నారు. ఈ అవకాశాన్ని ఉమ్మడి అనంతపురం జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



షైన్ ప్యూర్ సిల్వర్ జ్యువెలరీ దుకాణం, కొనుగోలుదారులు

నెలాఖరు వరకు బీమా గడువు పొడిగింపు

జిల్లా వ్యవసాయ అధికారిణి యు.ఉమామహేశ్వరమ్మ

ప్రజాశక్తి -అనంతపురం

జిల్లాలో నెలకొన్న వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో పంటలు సాగు చేసిన వాతావరణ బీమా ప్రీమియం చెల్లించేందుకు ఈనెల 31వ తేదీ వరకూ గడువు పెంచినట్లు జిల్లా వ్యవసాయ అధికారిణి యు.ఉమామహేశ్వరమ్మ సూచించారు. గురువారం స్థానిక కార్యాలయంలో క్లస్టర్ ఏడిఎలు, ఎంపిఇఒలతో రేషనలైజేషన్‌పై సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో 189 మంది ఎంపిఇఒలు అదనంగా ఉన్నారన్నారు. ఇప్పటి వరకు రైతు సేవాకేంద్రాల్లోని అగ్రికల్చర్ అసిస్టెంట్ల రేషన కార్యక్రమం చేపట్టి బదిలీలు చేపట్టామన్నారు. అయితే కొన్ని రైతు సేవా కేంద్రాల పరిధిలో పంటల సాగు విస్తీర్ణం అధికంగా ఉందన్నారు. అలాంటి చోట అదనంగా ఉన్న ఎంపిఇఒలను సర్దుబాటు చేయాలని ఆదేశించారు. కాగా ఈనెలాఖరు వరకూ పంటల సాగుకు అనుకూలంగా ఉంటుందన్నారు. కావున ఎడిఎలు రైతులకు అవగాహన కల్పించాలని కోరారు. అలాగే వాతావరణ బీమా చెల్లించేందుకు గడువు పెంచిన విషయాన్ని రైతులకు వివరించాలన్నారు. ఈ కార్యక్రమములో వ్యవసాయ డివిజన్ ఎడిఎ జిఎం అల్తాఫ్ అలీఖాన్, పద్మజ, వెంకటరాముడు, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

శింగనమల : మండలంలో పంటలు సాగు చేసిన రైతులు బీమా ప్రీమియం చెల్లించేందుకు ప్రభుత్వం ఈనెలాఖరు వరకూ గడువు పొడిగించినట్లు మండల వ్యవసాయ శాఖ అధికారి ఎన్.అన్వేష్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. బ్యాంకులు, కామన్ సర్వీస్ సెంటర్లలో పంటల బీమా ప్రీమియం చెల్లించుకోవచ్చన్నారు.

మాట్లాడుతున్న ఉమామహేశ్వరమ్మ

యాడికి : ప్రభుత్వం ఈనెలాఖరు వరకూ పంటల బీమా ప్రీమియం చెల్లించుకునేందుకు గడువు పొడిగించినట్లు మండల వ్యవసాయ అధికారి మహబూబ్ బాషా తెలిపారు. ఈమేరకు గురువారం మండల కేంద్రంలోని సంత మార్కెట్ వీధిలో ఉన్న రైతుసేవా కేంద్రం వద్ద రైతులతో కలిసి ఇందుకు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ఈనెల 31వ తేదీలోపు సాగు పంటలకు పంట బీమా చెల్లించుకోవాలన్నారు. లేనిపక్షంలో రైతులు నష్టపోయే ప్రమాదం ఉదన్నారు.

చౌడేశ్వరి జయంతి వేడుకలు

పెద్దపప్పూరు : మండల కేంద్రంలోని రామకోటి కాలనీతోపాటు చాగల్లులో గురువారం చౌడేశ్వరీదేవి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా అమ్మవారికి కుంకుమార్చన, అభిషేకం, మహా మంగళహారతి, అన్నదానం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం అమ్మవారిని పల్లకిలో కొలువుదీర్చి పురవీధుల గుండా మేళతాళాలతో ఊరేగించారు. భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు.

పామిడి : పామిడి మేజర్ పంచాయతీ పరిధిలోని పి.కొండాపురం గ్రామంలో చౌడేశ్వరీదేవి జయంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా ప్రత్యేక అభిషేకాలు, కుంకుమఅర్చనలు, అలంకరణలు, మహా మంగళహారతి వంటి కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం అమ్మవారిని మేళతాళాలతో గ్రామోత్సవం నిర్వహించారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

యాడికి : మండలంలోని రాయలచెరువులో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో బెంగళూరు శంకర కంటి ఆసుపత్రి సహకారంతో గురువారం ఏర్పాటు చేసిన ఉచిత మెగా వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. ఇందులో భాగంగా 90 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా 30 మందికి శస్త్ర చికిత్సలకు ఎంపిక చేశారు. వీరిని ఉచితంగా బస్సులో బెంగళూరుకు తీసుకువెళ్లి ఆపరేషన్లు చేయించి తిరిగి గమ్యస్థానాలకు చేర్చనున్నట్లు లయన్స్ క్లబ్ అధ్యక్షులు లక్ష్మీనారాయణ శెట్టి తెలిపారు. వైద్య శిబిరానికి వచ్చిన వారికి నాగేంద్ర హోటల్ వారు భోజన వసతి కల్పించారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీ రామనాథ్, ట్రెజరర్ అల్లాబకాష్, రవిప్రసాద్, సత్యనారాయణ, జయరామిరెడ్డి, ఇస్మాయిల్, శేషానందరెడ్డి, మురళీకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా చౌడమ్మ ఆలయ వార్షికోత్సవం

యల్లనూరు : మండల కేంద్రంలో నూతనంగా వెలసిన చౌడమ్మతల్లి మొదటి వార్షికోత్సవాన్ని గురువారం ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

డీలర్ల సమావేశం

పుట్లూరు : మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ శేషారెడ్డి ఆధ్వర్యంలో గురువారం డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ 65ఏళ్లకు పైబడిన వారితోపాటు వికలాంగులకు వారి ఇళ్ల వద్దకే వెళ్లి రేషన్ పంపిణీ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిఎస్‌డిటి రాజా, డీలర్లు, వీఆర్వోలు, తదితరులు పాల్గొన్నారు.

అయ్యంకి వెంకట రమణయ్యకు నివాళి

నార్పల : గ్రంథాలయ పితామహుడు అయ్యంకి వెంకట రమణయ్య జయంతిని పురస్కరించుకుని గురువారం మండల కేంద్రంలోని గ్రంథాలయంలో చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి ఎ.కావేరి, గ్రంథాలయ పాఠకులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

3న బహుజన ప్రజాప్రతినిధులకు సన్మానం

అనంతపురం : జిల్లాకేంద్రంలో వచ్చేనెల 3న బహుజన ప్రజాప్రతినిధులను ఘనంగా సన్మానించినట్లు ఆర్‌పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు నాగరాజు తెలిపారు. గురువారం అనంతపురంలోని ప్రెస్‌క్లబ్‌లో ఇందుకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో బహుజన యువసేన రాష్ట్ర అధ్యక్షులు చంద్రాచెర్ల హరి, జైభీమ్ సేన పార్టీ నాయకులు నరేష్, ఆర్‌పిఎస్ నాయకులు కిష్ట, దండు కేశవ్, ఆర్ఐఎఫ్ నాయకులు మహేష్, వాల్మీకి సంఘం నాయకులు బుల్లెట్ లింగమయ్య, చిన్న, కుళ్లాయమ్మ, నారాయణరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సమాచార హక్కు చట్టంపై అవగాహన

ఉరవకొండ : పట్టణంలోని రైతు సేవాకేంద్రంలో గురువారం సమాచార హక్కు చట్టంపై మండల వ్యవసాయ అధికారి రామకృష్ణ రైతులకు కల్పించారు. ఈ సందర్భంగా ఎఒ మాట్లాడుతూ సమాచార హక్కు చట్టంపై రైతులు అవగాహన కలిగి ఉండాలన్నారు. ఇందులో భాగంగా సమాచార హక్కు చట్టము అప్లికేషన్ ఎలా పూర్తి చేయాలి.. ప్రభుత్వ కార్యాలయాల్లో సమాచారం ఎలా తెలుసుకోవాలనే విషయాలను వివరించారు.

నాసాలో విజయం సాధించిన విద్యార్థులకు అభినందనలు

ప్రజాశక్తి-అనంతపురం

విద్యార్థులను అభినందిస్తున్న ఎజిఎం సుబ్బారెడ్డి

నాసా ప్రాజెక్టులో విజయం సాధించిన నగరంలోని కోర్టు రోడ్డులో ఉన్న శ్రీచైతన్య పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థులను ఎజిఎం సుబ్బారెడ్డి గురువారం అభినందించారు. ఈ సందర్భంగా ఎజిఎం మాట్లాడుతూ మనుషులు విశ్వంలో నివసించడానికి వీలుగా భూ వాతావరణం లాగా కృత్రిమమైన ఒక స్పేస్ హోటల్, స్పేస్ కాలనీ లాంటి వాటిని తయారు చేసి మానవ మనుగడ సాగించే విధంగా ప్రణాళికను శ్రీ చైతన్య విద్యార్థులు రూపొందించి ప్రాజెక్టును తయారు చేసి నాసాకు పంపించారన్నారు. రాష్ట్రవ్యాప్తంగానే కాకుండా దేశవ్యాప్తంగా మన ప్రాజెక్టులు ఉత్తమ ప్రాజెక్టుగా ఎంపిక చేసి విద్యార్థులు ప్రశంసలు పొందారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ తబస్సుం, డీన్లు సిరాజుద్దీన్, చిరంజీవి, అకాడమిక్ కో ఆర్డినేటర్ ఇర్షాద్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్డీటీకి ఎఫ్‌సిఆర్‌ఎను పునరుద్ధరించాలి

పామిడి : అనంతపురంలో పేదలకు సేవలు అందిస్తున్న రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్టుకు ఎఫ్‌సిఆర్‌ఎను వెంటనే పునరుద్ధరించాలని ఐ ఎం ఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు వంకర రాజు కాలువ వెంకటేష్ డిమాండ్ చేశారు. 'సేవ్ ఆర్డీటీ' పేరుతో గురువారం స్థానిక అంబేద్కర్ సర్కిల్ వద్ద ఐక్య మాదిగ సమాజ్ ఆధ్వర్యంలో చేపట్టిన 100 గంటల రిలే నిరాహార దీక్ష గురువారం కూడా కొనసాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకు సేవ చేస్తున్న ఆర్డీటీకి వెంటనే విదేశీ నిధులను పునరుద్ధరించాలని డిమాండ చేశారు. దీక్షకు సిపిఐ ఎంఎల్ రైతు కూలి సంఘం జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్, జిల్లా కార్యదర్శి గజ్జల దస్తగిరి, పకీరప్ప, నూర్‌బాషా, ఓబులయ్య, నారాయణస్వామి సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో లక్ష్మయ్య, సుధీర్, కేశవ, ఓబుళపతి, కృష్ణానాయక్, కొండూరు సుదర్శన్, తదితరులు పాల్గొన్నారు.

కక్కలపల్లి జయరాజ్‌కు పరామర్శ

అనంతపురం : గుండెపోటుకు గురై స్థానిక పావని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వాల్మీకి నాయకులు కక్కలపల్లి జయరాజును టిడిపి సీనియర్ నాయకులు కమ్మూరు నాగరాజు గురువారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయనకు అందిస్తున్న వైద్యం వివరాలను వైద్యులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి కుటుంబానికి ధైర్యం చెప్పారు. ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించి భరోసా కల్పించారు.

ఎద్దులపల్లిలో జిల్లా పంచాయతీ అధికారి పర్యటన

స్థానికులతో మాట్లాడుతున్న నాగరాజునాయుడు

పామిడి : మండలంలోని ఎద్దులపల్లి గ్రామ పంచాయతీలో జిల్లా పంచాయతీ అధికారి నాగరాజు నాయుడు గురువారం పర్యటించారు. ఇందులో భాగంగా గ్రామంలో ఇంటింటి చెత్త సేకరణ, ఎస్‌డబ్ల్యుపిసి షెడ్డు నిర్వహణ, ఐవిఆర్‌ఎస్ కాల్స్‌పై ప్రజలను అడిగి తెలుసుకున్నారు. తర్వాత క్లాప్ మిత్రలతో కలిసి ఇంటింటికీ వెళ్లి తడి, పొడి చెత్త ఇచ్చే విధంగా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారిణి తేజోష్న, ఎద్దులపల్లి ఇన్‌ఛార్జి పంచాయతీ సెక్రటరీ మహమ్మద్ రఫీ, క్లాప్ మిత్ర పాల్గొన్నారు.

28న జాబ్‌మేళా

అనంతపురం సిటీ : జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఈనెల 28న జాబ్‌మేళా ఏర్పాటు చేయనున్నట్లు జిల్లాలోని ఉపాధి కల్పనాధికారి ఎస్.కళ్యాణి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆరోజు కోర్టు రోడ్డులో ఉన్న జిల్లా ఉపాధి కల్పనాధికారి కార్యాలయంలో ఉదయం 10:30 గంటలకు ప్రారంభమవుతుందన్నారు.

సాహితీ ధ్రువతార జాషువా

ప్రజాశక్తి-అనంతపురం

వర్థంతి కార్యక్రమంలో మేయర్ వసీం

జాషువాకు నివాళులర్పిస్తున్న నాయకులు

సామాజిక అసమానతలు, వివక్షతను ప్రశ్నిస్తూ, సాహిత్యంలో తనకంటూ ప్రత్యేక ముద్ర వేసుకున్న నవయుగ కవి చక్రవర్తి మహాకవి గుర్రం జాషువా అని మేయర్ మహమ్మద్ వసీం కొనియాడారు. జాషువా వర్థంతిని పురస్కరించుకుని గుర్రం జాషువా సాహిత్య పీఠం ఆధ్వర్యంలో నగరంలోని విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలోని అణచివేత, పీడనలను ధిక్కార స్వరంతో ప్రతిఘటించి కులమతాల గీతలకు అందని విశ్వనరుడుగాను జాషువా అన్నారు. జాషువా సాహిత్యం నేటి తరానికి స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందన్నారు. యువత కూడా జాషువా సాహిత్యాన్ని అధ్యయనం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ కొగటం విజయ భాస్కర్‌రెడ్డి, ఆర్‌డిటి ఛైర్మన్ ఎం.తిప్పేస్వామి, జాషువా సాహిత్య పీఠం ప్రధాన కార్యదర్శి హెచ్ నాగలింగయ్య, నానీల నాగేంద్ర, పూజారి ఈరన్న, ఉల్లికల్లు మల్లికార్జున, ఎ. ఓబుళపతి, దాసరి ఆదినారాయణ, శంకర్, కుళ్లాయప్ప, చంద్రాచెర్ల హరి, చెట్ల ఈరన్న, షేక్ రియాజుద్దీన్, జూటూరు షరీఫ్, టీవీ రెడ్డి, తోట నాగరాజు, గంగిరెడ్డి గారి అశ్వర్థరెడ్డి, డి.కృష్ణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుదాం

ప్రజాశక్తి-ఉరవకొండ

జిల్లా పరిషత్ సిఇఒ శివశంకర్

అవగాహన కల్పిస్తున్న జిల్లా పరిషత్ సిఇఒ శివశంకర్

పక్కడ్బందీగా ఇంటింటి చెత్త సేకరణ చేపట్టి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతోపాటు ప్రజల ఆరోగ్యాలను కాపాడదామని జిల్లా పరిషత్ సీఈవో శివశంకర్ పిలుపునిచ్చారు. గురువారం విడపనకల్ మండల పరిధిలోని ఉండబండ గ్రామంలో ఇంటింటి చెత్తసేకరణ ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ఇందులో భాగంగా గ్రామపంచాయతీ పరిధిలోని ఎస్సీ, బీసీ, ఓసీ కాలనీలతో పాటు ప్రధాన రహదారులు, వీధి రోడ్లు, ఆలయాల పక్కన ఇంటింటి చెత్త సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల శుభ్రతను మెరుగుపర్చుకోవాలన్నారు. ముఖ్యంగా ప్లాస్టిక్ వ్యర్థాలు, తడి, పొడి చెత్తను వేర్వేరుగా ఉంచాలనే అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ షకీలాబేగం, మండల పరిషత్ అడ్మినిస్ట్రేషన్ అధికారి భాస్కర్‌బాబు, ఇఒఆర్‌డి సత్యబాబు, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

జూదరులు అరెస్టు

నిందితుల వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

పెద్దవడుగూరు : మండలంలోని దిమ్మగుడి పరిపరిసర ప్రాంతాల్లో ఉన్న జూద కేంద్రంపై పోలీసులు గురువారం దాడి చేసి ఐదుగురిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ ఆంజనేయులు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. గ్రామంలోని చౌడమ్మ ఆలయం వద్ద పేకాట ఆడుతున్న విషయాన్ని తెలుసుకుని దాడి చేసి రూ.20,600 నగదు స్వాధీనం చేసుకుని ఐదుగురిని అరెస్టు చేసినట్లు తెలిపారు. నిందితులపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.